సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ


మంగళవారం । 7 । మే । 2024



ట్రిపుల్ ఐటీ.. భవితకు మేటి

రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీస్(ఆర్‌జీయూకేటీ)లో 2024–25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల నోటిఫికేషన్ విడుదలైంది.

8లో



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం తూర్పు డెల్టాకు 100, మధ్య డెల్టాకు 500, పశ్చిమ డెల్టాకు 3,350 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

గరిష్టం/కనిష్టం 41.0° / 28.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	41.0	29.0
కాకినాడ	39.0	29.0
అమలాపురం	40.0	28.0

న్యూస్‌రీల్

జగన్ పాలనలో ముస్లింలకు ప్రాధాన్యం



మామిడికుదురులో మాట్లాడుతున్న అబ్దుల్ ఖాదిర్

మామిడికుదురు: ముస్లింలకు అన్ని రంగాలలోనూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారని అంబేడ్కర్ కోనసీమ జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ ఖాదిర్ అన్నారు. వైఎస్సార్ సీపీ రాజోలు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావుకు మద్దతుగా సోమవారం ఆ పార్టీ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కటకంశెట్టి ఆదిత్య స్వగృహంలో ముస్లింల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వక్ఫ్ బోర్డు జిల్లా డైరెక్టర్ ఎండీవై షరీఫ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఖాదిర్ మాట్లాడుతూ ముస్లింలపై కపట ప్రేమ చూపించే చంద్రబాబు 2014 నుంచి 19 వరకు కేవలం 2,600 కోట్లు ఖర్చు చేశారన్నారు. అదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.26 వేల కోట్లు ఖర్చు చేసి ముస్లింలపై తనకున్న ప్రేమను చాటుకున్నారన్నారు. తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చూపిన బాటలోనే తనయుడు జగన్ నడిచి ముస్లింలకు అండగా నిలిచారన్నారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో ముస్లింలందరూ ఫ్యాను గుర్తుకు ఓట్లు వేయాలని కోరారు. ఎంపీగా రాపాక వరప్రసాదరావు, ఎమ్మెల్యేగా గొల్లపల్లి సూర్యారావుతో పాటు రాష్ట్రంలోని వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించడం ద్వారా ముస్లింల సత్తా ప్రతిపక్షాలకు చాటి చెప్పాలన్నారు. సమావేశంలో రాజ్ మొహిద్దీన్, సర్కిల్ ముస్తఫా, మజహర్ అలీ పాల్గొన్నారు.

నేటి నుంచి హోమ్ ఓటింగ్

అమలాపురం రూరల్: జిల్లాలో మంగళవారం నుంచి హోమ్ ఓటింగ్ ప్రారంభమవుతుందని, ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలోని 1,251 మంది ఈ విధానంలో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా తెలిపారు. హోమ్ ఓటింగ్ కోసం 73 బృందాలు నియమించి, 85 వాహనాలను ఏర్పాటు చేశామన్నారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో 172 మంది, మండపేటలో 260 మంది, రామచంద్రపురంలో 65 మంది, పి.గన్నవరంలో 421 మంది, కొత్తపేటలో 63 మంది, రాజోలులో 161 మంది, అమలాపురంలో 109 మంది హోమ్ ఓటింగ్‌కు అర్హత సాధించారన్నారు.

నిఘా బృందాల విస్తృత దాడులు



రాజోలు మండలంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్న జిల్లా పోలీస్ ఎలక్షన్ అబ్జర్వర్ చంద్రకాంత్

అమలాపురం టౌన్: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా నిఘా బృందాలు చేస్తున్న దాడులు, తనిఖీల్లో అక్రమ మద్యం భారీగా పట్టుబడుతోంది. జిల్లా ఎస్పీ సునరావు శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా ఆధ్వర్యంలో జిల్లాలో ఆది, సోమవారాల్లో నిర్వహించిన దాడులు, తనిఖీల్లో పట్టుబడిన మద్యం, సారా, కేసులు, అరెస్ట్ అయిన నిందితుల వివరాలను జిల్లా ఎస్పీ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

- జిల్లాలో నిర్వహించిన దాడుల్లో నిఘా బృందాలు 9 కేసులు నమోదు చేసి, పది మందిని అరెస్ట్ చేశాయి. వారి నుంచి 9 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 135 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 26.50 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్, 10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నాయి.
- రాజోలు మండలంలోని పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను జిల్లా పోలీస్ ఎలక్షన్ అబ్జర్వర్ ఎంవీ చంద్రకాంత్ తనిఖీలు చేసి స్థానిక పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు.
- అమలాపురం రూరల్ మండలం సమనస, కామనగరువు, వన్నె చింతలపూడి గ్రామాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల ప్రాంతాల్లో స్థానిక పోలీసు అధికారులు కేంద్ర బలగాలతో కలిసి సోమవారం సాయంత్రం కవాతు నిర్వహించారు.
- జిల్లాలో ఎన్నికల సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జొన్నాడ, గోపాలపురం, ఎదుర్లంక, దిండి, బొబ్బర్లంక, నరసాపురపుపేట వద్ద గల జిల్లా సరిహద్దు చెక్ పోస్ట్‌ల్లో నిఘా బృందాలు సోమవారం వాహనాలు నిలిపి విస్తృత తనిఖీలు చేశాయి.

సమర గళమై.. కదన దళమై..

- నేడు కోరుకొండకు సీఎం జగన్ రాక
- ఎన్నికల ప్రచార సభలో ప్రసంగించనున్న జననేత
- వేలాదిగా తరలి రానున్న జనం
- 2019 ఎన్నికలకు ముందూ ఇక్కడ జగన్ సభ
- నాడు వైఎస్సార్ సీపీ అఖండ విజయం
- అదే సెంటిమెంట్ రిపీటవుతుందంటున్న విశ్లేషకులు



2019 ఏప్రిల్ 7: కోరుకొండ సెంటర్‌లో ఎన్నికల ప్రచార సభలో వైఎస్సార్ సీపీ రాజానగరం అభ్యర్థి జక్కంపూడి రాజాను పరిచయం చేస్తున్న జగన్



2019 ఏప్రిల్ 7: కోరుకొండ సభలో అశేష జనాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తున్న జగన్

సాక్షి ప్రతినిధి, కాకినాడ: గత ఎన్నికల వేళ చెప్పిన మాట చెప్పినట్టుగా అమలు చేయడమే కాదు.. అంతకు మించి చేసి చూపించారు ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. అందువల్లనే ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల సమరాంగణాన.. దేశ చరిత్రలోనే ఇప్పటి వరకూ ఏ రాజకీయ నాయకుడూ సాహసించని రీతిలో.. తన ప్రభుత్వం ద్వారా మీ కుటుంబంలో ఏదైనా మేలు జరిగినట్టు భావిస్తేనే తనకు ఓటేయండని ప్రజలను ధైర్యంగా అడుగుతూ.. దమ్మున్న ఏకైక నాయకుడిగా పేరొందారు. గడచిన ఐదేళ్లుగా ప్రజలకు ఎన్నో మేళ్లు చేసి, వాటిని కొనసాగించేందుకు మరో ఐదేళ్లు అవకాశం ఇవ్వాలని కోరుతూ ఆయన ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రజల మద్దతు కోరుతూ తూర్పు గోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం కోరుకొండలో మంగళవారం ఉదయం జరిగే సభలో పాల్గొంటున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చిన తరువాత ఉమ్మడి జిల్లాలో ఆయన పాల్గొంటున్న రెండో ప్రచార సభ ఇది. సీఎం జగన్ ఎక్కడ సభ నిర్వహించినా కట్టలు తెగిన వరద గోదారిలా వేలాదిగా పోటెత్తుతున్న జనం కదన దళంలా తరలివస్తున్నారు. 'నీవెంటే మేమంటూ' వేలాదిగా సమరగళమై గర్జిస్తున్నారు.

ఐదేళ్ల క్రితం..

సరిగ్గా ఐదేళ్ల క్రితం 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇదే కోరుకొండలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్నారు. లక్ష్మీ నరసింహస్వామి సన్నిధికి అభిముఖంగా నాడు నిర్వహించిన ఆ ఎన్నికల ప్రచార సభ నభూతో.. అనే రీతిలో సాగింది. ప్రత్యర్థుల వెన్నులో వణుకు పుట్టించింది. నాటి ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అఖండ విజయం సాధించింది. రాజానగరం నియోజకవర్గం నుంచి 32 వేల పై చిలుకు మెజార్టీతో జక్కంపూడి రాజా తొలిసారి శాసనసభ్యుడిగా విజయకేతనం ఎగురవేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టారు. నాటి సార్వత్రిక ఎన్నికల సందర్భంగా 2019 ఏప్రిల్ 7న ఆయన ఇక్కడ జరిగిన ప్రచార సభలో పాల్గొన్నారు. సరిగ్గా ఐదేళ్ల ఒక్క నెల తరువాత.. మే 7న అంటే మంగళవారం తిరిగి అదే కోరుకొండకు సీఎం జగన్ వస్తూండటం విశేషం. నాడు ఎన్నికల ప్రచారానికి వినియోగించిన బస్సు నుంచే.. ఉప్పొంగిన అభిమానంతో అశేషంగా తరలివచ్చిన జనసందోహాన్ని ఉద్దేశించి జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగించారు. ఐదేళ్ల తరువాత జరుగుతున్న ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల కోసం మంగళవారం అదే ప్రాంతంలో ఆయన బస్సు పైనుంచి ప్రసంగించనుండటం యాదృచ్ఛికమే అయినా సెంటిమెంట్‌గా భావిస్తున్నారు. కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో జరిగే జగన్ ఎన్నికల ప్రచార సభతో నాటి సెంటిమెంట్ రిపీటవుతుందని, రాష్ట్రంలో, రాజానగరంలో వైఎస్సార్ సీపీ విజయబావుటా ఎగురవేయడం ఖాయమని పార్టీ శ్రేణులు ఢంకా బజాయించి మరీ చెబుతున్నాయి. నాడు జగన్ అప్పటి, ఇప్పటి అభ్యర్థి జక్కంపూడి రాజా తన తమ్ముడంటూ, తమ్ముడిని గెలిపిస్తే తనను కూడా గెలిపించినట్టేనని ప్రజల మనసు చూరగొన్నారు. తాను ముఖ్యమంత్రి కావాలంటే రాజాను గెలిపించాలని నాడు ప్రజలను అభ్యర్థించారు. అదే తరహాలో ఈసారి కూడా ప్రజల మనసుల్ని చూరగొనేందుకు వస్తున్నారు. గత ఎన్నికల సందర్భంగా ప్రకటించిన మేనిఫెస్టోలో చెప్పినవే కాదు.. అందులో చెప్పనివి కూడా పూర్తి స్థాయిలో అమలు చేసిన ముఖ్యమంత్రిగా జగన్ మరోసారి ప్రజల ముందుకు వస్తున్నారు.

'మేమంతా సిద్ధం' అంటూ..

గత నెల 18న మేమంతా సిద్ధం బస్సు యాత్ర ద్వారా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పర్యటించిన జగన్‌కు అడుగడుగునా ప్రజలు నీరాజనాలు పట్టారు. సంఘీభావంగా నిలిచారు. సంక్షేమ పథకాలతో పేదల తలరాతలు మార్చి, నవరత్నాలతో అందరి జీవితాల్లో వెలుగులు నింపి, కనీవినీ ఎరుగని రీతిలో సంక్షేమం, అభివృద్ధిని పరుగులు పెట్టించిన జగన్ వైపే తామంతా ఉన్నామని ఘంటాపథంగా చెబుతున్నారు. గత నెల 28న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట సెంటర్‌లో సీఎం జగన్ పాల్గొన్న తొలి ఎన్నికల ప్రచార సభకు సైతం వేలాదిగా జనం పోటెత్తారు. అదే సెంటర్‌లో సరిగ్గా ఐదేళ్ల క్రితం 2019లో జగన్ సభ జరగడం కూడా మరో విశేషం. ఎన్నికలు తుది దశకు చేరుకుని, మరో ఐదు రోజుల్లో ప్రచార పర్వానికి తెర పడనున్న నేపథ్యంలో సీఎం జగన్ కోరుకొండలో సమరశంఖం పూరించనున్నారు. గడచిన ఐదేళ్లలో రూ.1,773 కోట్లతో అభివృద్ధి, రూ.1,377 కోట్లతో సంక్షేమాన్ని, 20 వేల పై చిలుకు ఇళ్లు అందించి, ఇచ్చిన హామీలన్నింటినీ నూరు శాతం అమలు చేసిన రాజాను ఎమ్మెల్యేగా మరోసారి ఆశీర్వదించాలని, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలని జగన్ ప్రజలను కోరనున్నారు. మీ కుటుంబంలో మంచి చేసి ఉంటేనే ఓటేయండని అడగనున్నారు. ఈ ప్రచార సభకు తరలివెళ్లేందుకు వేలాదిగా జనం 'మేమంతా సిద్ధం' అంటున్నారు. గత ఎన్నికల్లో సాధించిన ఫలితాల సెంటిమెంటే ఈ సభ ద్వారా ఈ సార్వత్రిక ఎన్నికల్లో కూడా రిపీటవడం ఖాయమని అంటున్నారు.

వేలాదిగా తరలిరండి



ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఉదయం 9.45 గంటలకు తాడేపల్లి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి, 10.30 గంటలకు కోరుకొండ చేరుకుంటారు. లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో జరిగే ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగిస్తారు. ఈ సభకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలి రావాలని, సుశిక్షితులైన సైనికుల్లా క్రమశిక్షణ పాటిస్తూ, సభను విజయవంతం చేయాలని కోరుతున్నా.

– జక్కంపూడి రాజా, ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

సంక్షేమం కొనసాగాలంటే జగనే రావాలి

- వైఎస్సార్ సీపీ ఎన్‌ఆర్‌ఐ విభాగం నాయకులు
- కొవ్వూరు చేరుకున్న బస్సుయాత్ర



కొవ్వూరులో ఎమ్మెల్యే తలారి వెంకట్రావును కలిసి సంఘీభావం ప్రకటిస్తున్న ఎన్‌ఆర్‌ఐ విభాగం నాయకులు

కొవ్వూరు: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగన్ ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్ సీపీ ఎన్‌ఆర్‌ఐ విభాగం నాయకులు అన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి, వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీకి మద్దతుగా వారు చేపట్టిన బస్సుయాత్ర సోమవారం సాయంత్రానికి కొవ్వూరు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, తామంతా జగనన్నకి మద్దతుగా బస్సుయాత్ర చేస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయభేరి మోగించడం ఖాయమన్నారు. అన్ని వర్గాల ప్రజలూ వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారన్నారు. ఎల్లో మీడియా, కూటమి పార్టీలు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై దుష్ప్రచారం చేస్తున్నాయని, ఆ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా, ఎన్ని మోసపూరిత హామీలు ఇచ్చినా రానున్నది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. కొవ్వూరు నియోజకవర్గంలో ఎన్‌ఆర్‌ఐ విభాగం నాయకుడు పసుపులేటి వీరభద్రరావు సారథ్యంలో తాళ్లపూడి మండలంలోని తిరుగుడు మెట్ట, పెద్దేవం, బల్లిపాడు, వేగేశ్వరపురం గ్రామాలతో పాటు కొవ్వూరు పురపాలక సంఘంలో పర్యటించారు. యూరప్ కన్వీనర్ యల్లాప్రగడ కార్తిక్, అమెరికా కన్వీనర్ కోడూరు కృష్ణారెడ్డి, స్విట్జర్లాండ్‌కు చెందిన బావిగడ్డ బ్రహ్మానందరెడ్డి, ఇటలీకి చెందిన కిషోర్ యాదవ్, నెదర్లాండ్స్ నుంచి సారథి రెడ్డి వంగా, కువైట్ ప్రతినిధి కుమార స్వామి, దుబాయ్ నుంచి వెంకట రామయ్య, రాష్ట్ర ఐటీ విభాగం కార్యదర్శి నానిరెడ్డి, యూఎస్‌ఏకి చెందిన సుభాషిణి, రాష్ట్ర ఐటీ విభాగం కార్యదర్శి కృపాసాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొవ్వూరులో ఎమ్మెల్యే తలారి వెంకట్రావుని కలిసి తన సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు తోట రామకృష్ణ, చెట్టే సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలలో పకడ్బందీ రక్షణ వ్యవస్థ

అమలాపురం రూరల్: ఎన్నికల సంఘం అందుబాటులోకి తీసుకువచ్చిన ఈవీఎంలు ప్రత్యేకమైనవని, వీటి అంతర్గత భద్రత, రక్షణ వ్యవస్థలు, పకడ్బందీగా ఉంటాయని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా తెలిపారు. ఈవీఎంల పనితీరుపై సోమవారం కలెక్టరేట్‌లో ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా జరగడానికి ఇవి ఉపయోగపడతాయన్నారు. మే 13వ తేదీ జరిగే సార్వత్రిక ఎన్నికలకు జిల్లా యంత్రాంగం పకడ్బందీగా ఏర్పాట్లు చేసిందన్నారు. దానిలో భాగంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ద్వారా ఓటు వేసే విధానంపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. పోలింగ్ రోజున ఈవీఎంలను వినియోగించే విధానంపై ప్రిసైడింగ్ అధికారులకు సైతం శిక్షణ ఇచ్చామని తెలిపారు. కంట్రోల్ యూనిట్లోని బ్యాలెట్ బటన్ ద్వారా పీఓ అనుమతించిన తర్వాత ఓటరు బ్యాలెట్ యూనిట్లో ఓటు వేయడానికి వీలవుతుందన్నారు. బ్యాలెట్ యూనిట్లో అంధుల కోసం ప్రత్యేకంగా బ్రెయిలీ లిపితో కూడిన గుర్తులు ఉంటాయని, చేతి వేళ్లతో తడిమితే స్పష్టంగా గుర్తు పట్టవచ్చునని వివరించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో డమ్మీ ఈవీఎంలను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్టు కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు.

ఎన్నికల్లో వినియోగించే ఈవీఎంలను పకడ్బందీ బందోబస్తు నడుమ భద్రపరిచామని, ఎన్నికల నిబంధనల మేరకు ర్యాండమైజేషన్ల ప్రక్రియ పూర్తి చేశామన్నారు.

జిల్లాకు ఆరుగురు ఎన్నికల పరిశీలకులు

ఎన్నికల నిర్వహణ కోసం జిల్లాకు ఇద్దరు సాధారణ, ముగ్గురు వ్యయ, ఒక పోలీస్ విభాగం పరిశీలకులు కలిపి మొత్తం ఆరుగురు ఐఏఎస్, ఐఆర్ఎస్, ఐపీఎస్ అధికారులు నియమితులైనట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా తెలిపారు. వీరందరూ మలికిపురం మండలం దిండి ఆర్‌వీఆర్ సరోవర్‌లో అందుబాటులో ఉంటారన్నారు. సాధారణ పరిశీలకులు రాజేశ్వర్ గోయల్ (89789 62588) అమలాపురం పార్లమెంటు, పి.గన్నవరం, రాజోలు, అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గాలు, అలాగే మరో సాధారణ పరిశీలకులు పరదీప్ కుమార్ (89775 02588) ముమ్మిడివరం, రామచంద్రపురం, మండపేట, కొత్తపేట, అసెంబ్లీ నియోజకవర్గాలలో ఎన్నికల నిర్వహణ తీరును పర్యవేక్షిస్తారన్నారు. పోలీస్ పరిశీలకులు ఎంవీ చంద్రకాంత్ (78932 56556) అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గంలో పోలీసు సంబంధిత సాధారణ ఎన్నికల నిర్వహణ తీరును తెలుసుకుంటారన్నారు.

వ్యయ పరిశీలకులు ఉమేష్ కుమార్ (78935 12588) పార్లమెంట్ స్థానానికి, రాహుల్ దింగ్రా (89784 52588) ముమ్మిడివరం, రామచంద్రపురం, మండపేట అసెంబ్లీ స్థానాలకు, సుమిత్ దాస్ గుప్తా (73308 62588) రాజోలు, పి.గన్నవరం, అమలాపురం అసెంబ్లీ స్థానాల అభ్యర్థుల వ్యయాలను పర్యవేక్షిస్తారు.



ఈవీఎంల పనితీరును వివరిస్తున్న కలెక్టర్ శుక్లా

కొనసాగిన పోస్టల్ బ్యాలెట్

అమలాపురం రూరల్: పోస్టల్ బ్యాలెట్‌లో భాగంగా రెండోరోజు సోమవారం 41.65 శాతం పోలింగ్ జరిగింది. ఎన్నికల విధులలో పాల్గొనే పీవో, ఏపీవో, ఓపీవో, ఎంఓలతో పాటు పోలీసులు, మెడికల్ సిబ్బంది, ఇతర సర్వీసు ఉద్యోగులు పోస్టల్ ఓటు వేశారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో ఎంపిక చేసిన పోలింగ్ బూత్‌లలో వీరంతా తమ ఓటును సద్వినియోగం చేసుకున్నారు. జిల్లాలో 14,566 మంది పీవో, ఏపీవో, ఓపీవో, ఎంఓతో పాటు ఇతర ఓటర్లు ఉన్నారు. వీరిలో ఆదివారం సాయంత్రం ఆరు గంటల సమయానికి 6,927 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మిగిలిన 7,639 మందిలో సోమవారం 3,182 ఓటు వేశారు. రాజోలు అసెంబ్లీ స్థానంలో అత్యధికంగా 1,111 మందికి గాను 635 మంది (47.16 శాతం) ఓటు వేశారు. అత్యల్పంగా మండపేట నియోజకవర్గంలో 1,178 మందికి 232 మంది (22.34) వినియోగించుకున్నారు.

మత్స్యకారులకు బతుకు భరోసా

- అండగా నిలిచిన ప్రభుత్వం
- అనేక పథకాలతో ఆర్థిక చేదోడు

ముమ్మిడివరం: గోదావరి గలగలలు వింటూ, రివ్వున వీచే గాలుల నడుమ పడవలపై చేపల వేట సాగించడం మత్స్యకారుల నిత్య కృత్యం. ఇది చూసేవారి మనసును ఆహ్లాదపరిచినా, మత్స్యకారులకు మాత్రం జీవన పోరాటం. తెల్లవారకుండానే మత్స్యకారుల మొలలో వల చేరుతుంది, బుంగ భుజమెక్కుతుంది. వేటకు వెళ్లిన వారికి ప్రతిరోజూ పరీక్షే. గంగమ్మ తల్లి కరుణిస్తే వారి వలలో చేపల పంట పండుతుంది. లేకపోతే గంటలు గడుస్తున్నా, ఎన్నిసార్లు వల విసిరినా ఒక్క చేప కూడా చిక్కదు. గంగమ్మనే నమ్ముకుని, ఆ అమ్మ కడుపులో దాగి ఉన్న మత్స్య సంపద కోసం వేట సాగిస్తూనే ఉంటారు. అయితే ఇటీవల సముద్ర గర్భంలో ఆయిల్ నిక్షేపాల అన్వేషణ బాగా పెరిగింది. దానివల్ల ఏర్పడుతున్న కాలుష్యం కారణంగా గోదావరి, సముద్ర తీరంలో మత్స్య సంపద తరిగిపోతోంది.

వేటతోనే జీవనోపాధి

జిల్లాలోని సఖినేటిపల్లి మండలం అంతర్వేది సముద్ర సంగమ ప్రాంతం నుంచి కాకినాడ వరకూ విస్తరించిన సముద్ర తీరాన్ని నమ్ముకుని వేలమంది అగ్నికుల క్షత్రియులు జీవనోపాధి పొందుతున్నారు. సంప్రదాయ పద్ధతిలో వీరు సాగించే వేట కారణంగా సంపాదన పెద్దగా ఉండదు. చాలామంది మత్స్యకారులు పేద వర్గానికి చెందిన వారే. అటువంటి మత్స్యకారుల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్ద పీట వేసింది. వేట నిషేధ సమయంలో ఇచ్చే పరిహారాన్ని పెంచడంతో పాటు అర్హులందరికీ ఇవ్వడం, చమురు సంస్థల ద్వారా నష్టపోయిన మత్స్యకారులకు పరిహారం అందజేయడం, డీజిల్ రాయితీ పెంచడం, మత్స్యకారులు చనిపోతే వారి కుటుంబానికి బీమా సొమ్ములు చెల్లించడం .. ఇలా వారికి అనేక విధాలుగా అండదండగా నిలుస్తోంది.

రూ.647 కోట్ల చమురు సంస్థల పరిహారం

చమురు సంస్థల వల్ల నష్టపోయిన మత్స్యకారులకు ప్రభుత్వం భారీగా పరిహారం అందిస్తోంది. ప్రధానంగా ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం, తాళ్లరేవు మండలాల్లోని మత్స్యకారులకు అధికంగా అందుతోంది. గడచిన ఐదేళ్లలో జిల్లా వ్యాప్తంగా 23,458 మందికి రూ.647 కోట్ల పంపిణీ చేశారు. ప్రతిపక్ష నేతగా పాదయాత్ర చేసిన సమయంలో మత్స్యకారుల వెతలు విన్న జగన్.. అధికారంలోకి రాగానే చమురు సంస్థలతో చర్చలు జరిపి పరిహారం అందించారు. మొత్తం ఐదు విడతలుగా ఈ పరిహారం నేరుగా మత్స్యకారుల ఖాతాలలో డీబీటీ ద్వారా జమ చేశారు. ముమ్మిడివరం నియోజకవర్గంలోని మండలాలతో పాటు అయినవిల్లి, కె.గంగవరం, కపిలేశ్వరపురం, కొత్తపేట మండలాలకు చెందిన 69 గ్రామాలలోని 6,078 బోట్లకుగాను ఈ పరిహారం అందుతోంది. లబ్ధిదారులలో 647 మంది ఒంటరి మహిళలు ఉన్నారు.

మత్స్యకార భరోసా

వైఎస్సార్ మత్స్యకార భరోసా ద్వారా ఐదేళ్లలో రూ.90.40 కోట్లు పంపిణీ చేశారు. టీడీపీ హయాంలో కేవలం రూ.నాలుగు వేల చొప్పున మాత్రమే అందించేవారు. దీనిని సీఎం జగన్ మోహన్ రెడ్డి రూ.పది వేలకు పెంచి మత్స్యకారులకు పంపిణీ చేస్తున్నారు. నలభై ఐదు రోజుల పాటు వేట నిషేధం ఉత్తర్వులు ఉండడంతో వందల మంది మత్స్యకారులు ఇళ్లకే పరిమితం కావాల్సి వస్తోంది. ఈ సమయంలో వీరికి రోజువారీ జీవనోపాధి కూడా కష్టమే. అలాంటి వారిని మత్స్యకార భరోసా అండగా ఉంటోంది.

డీజిల్ రాయితీ, మత్స్యకార బీమా

వేట బోట్లకు వినియోగించే డీజిల్‌కు ప్రభుత్వం రాయితీ అందిస్తోంది. రిజిస్ట్రర్ అయిన మెకనైజ్డ్ బోట్లకు దీనిని వర్తింపజేశారు. జిల్లాలోని 769 మందికి డీజిల్ రాయితీగా రూ.16.43 కోట్లు ఖర్చు చేశారు. అలాగే వివిధ కారణాలతో మత్స్యకారులు మృతి చెందితే వారి కుటుంబ సభ్యులకు వైఎస్సార్ మత్స్యకార బీమాలో 666 మందికి రూ.58.94 లక్షలు పరిహారంగా అందించారు.



ముమ్మిడివరం మండలం కొమానపల్లిలో మత్స్యకార దినోత్సవ సభలో పాల్గొన్న సీఎం జగన్ (ఫైల్)

మత్స్యకారులకు అందిన లబ్ధి

పథకం	లబ్ధిదారులు	మొత్తం
చమురు సంస్థల పరిహారం	23,458	రూ.647 కోట్లు
మత్స్యకార భరోసా	7,452	రూ.90.40 కోట్లు
డీజిల్ రాయితీ	769	రూ.16.43 కోట్లు
మత్స్యకార బీమా	666	రూ.58.94 లక్షలు

రుణపడి ఉంటాం



జగన్ ప్రభుత్వం వచ్చిన తరువాత మా కుటుంబాలకు పలు రకాలుగా మంచి జరిగింది. ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ చేసిన కృషితో ఎంతోకాలంగా నిలిచిపోయిన ఓఎన్‌జీసీ నష్టపరిహారం అందింది. సుమారుగా ఐదేళ్లలో మా కుటుంబానికి రూ.2.75 లక్షలు అందింది. సీఎం జగన్, ఎమ్మెల్యే సతీష్ కుమార్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం.

– ఓలేటి భగవాన్, పోర గ్రామం, కాట్రేనికోన మండలం

ఆర్థికంగా నిలబడ్డాం



ఓఎన్‌జీసీ నష్టపరిహారం కింద ఒక్కొక్కరికీ రూ.2.75 లక్షల వరకూ వచ్చింది. ఈ సొమ్ముతో మేము అప్పులు తీర్చుకోవడమే కాకుండా పిల్లలను ఉన్నత చదువులు చదివించుకుంటున్నాం. ఆర్థికంగా నిలదొక్కుకున్నాం. సీఎం జగన్ పాలనలో మత్స్యకారులకు మేలు జరిగింది.

– చింతా నాగ మునీంద్రరావు, చింతావానిరేవు, ముమ్మిడివరం మండలం

అవసరాలు తీరాయి



గతంలో వేట నిషేధ సమయంలో మాకు పూట గడవడమే చాలా కష్టంగా ఉండేది. ఆ సమయంలో ఇచ్చే రూ. నాలుగు వేల పరిహారం సరిపోయేది కాదు. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ఆ పరిహారాన్ని రూ.పది వేలకు పెంచారు. నాకు నాలుగేళ్లలో ఏడాదికి రూ.పది వేల చొప్పున రూ.40 వేలు అందింది. ఆ సొమ్ములు వేట లేని సమయంలో కుటుంబ అవసరాలు తీరడంతో పాటు వలల మరమ్మతులకు ఉపయోగపడ్డాయి.

– మల్లాడి రాజేష్, బలుసుతిప్ప, కాట్రేనికోన మండలం

క్లుప్తంగా

పొలంలో ధాన్యం రాశుల దగ్ధం



పటవల గ్రామంలో కాలిపోయిన పశువుల పాక, ధాన్యం రాశులు

తాళ్లరేవు: మండల పరిధిలోని పటవల గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి మంటలు రేగి పశువుల పాక, మూడు ధాన్యం రాశులు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో ఇద్దరు కౌలు రైతులకు సుమారు రూ.6 లక్షల మేర నష్టం సంభవించింది. స్థానికులు, బాధితుల కథనం ప్రకారం .. పటవల నుంచి మంజేరు వెళ్లే దారిలో మేడిశెట్టి రాంబాబుకు చెందిన పశువుల పాక ఉంది. అక్కడే సుమారు 5 ఎకరాల పంటకు సంబంధించి ధాన్యం రాశి వేశారు. దాని పక్కనే మరో రైతు కోట మాణిక్యానికి సంబంధించిన ఎకరం పొలంలోని ధాన్యం రాశి కూడా ఉంది. ఆదివారం అర్ధరాత్రి సమయంలో మంటలు వ్యాపించడంతో అటుగా వెళుతున్న ఓ పండ్ల వ్యాపారి విషయాన్ని ఆ రైతులకు తెలిపాడు. వారి సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బందికి వచ్చి మంటలను అదుపుచేశారు. అప్పటికే పశువుల పాక పూర్తిగా కాలిపోగా, ధాన్యం రాశుల చాలా వరకూ కాలిపోయాయి. ఈ విషయాన్ని బాధిత రైతులు కోరంగి పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన వెనుక పలు అనుమానాలున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

గుండెపోటుతో ఉపాధి కూలి మృతి

సీతానగరం: చినకొండేపూడికి చెందిన ఉపాధి కూలి కరక త్రిమూర్తులు (46) సోమవారం పని ప్రదేశంలో గుండెపోటుతో మృతి చెందాడు. భార్య అరుణతో కలిసి చినకొండేపూడి శివారు అప్పన్న చావిడి వద్ద పంటబోదె పూడిక పనికి వెళ్లాడు. ఉదయం 8 గంటలకు టిఫిన్ తిని, తిరిగి పని చేస్తుండగా ఒక్కసారిగా గుండెపోటు వచ్చింది. అపస్మారక స్థితిలోకి వెళ్లిన అతడిని భార్య, తోటి కూలీలు సీతానగరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే త్రిమూర్తులు మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న ఏపీవో నాగేశ్వేణి త్రిమూర్తులు కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

ట్రిపుల్ ఐటీ.. భవితకు మేటి

- ఆర్జీయూకేటీ నోటిఫికేషన్ విడుదల
- పదో తరగతి మార్కుల ఆధారంగా ఎంపిక
- 8 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ



పరీక్షా కేంద్రానికి వెళుతున్న టెన్త్ విద్యార్థులు (ఫైల్)



ట్రిపుల్ ఐటీ భవనం

రాయవరం: రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ)లో 2024–25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల నోటిఫికేషన్ విడుదలైంది. 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల చూపు అంతా ట్రిపుల్ ఐటీ వైపు మళ్లింది. ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ ప్రోగ్రామ్‌లో భాగంగా రాష్ట్రంలోని నాలుగు వేల ట్రిపుల్ ఐటీ సీట్లలో జిల్లాకు ఎన్ని సీట్లు కేటాయిస్తారు, అందులో ఎన్ని సీట్లు వస్తాయనే విషయాలపై విద్యార్థులు దృష్టి సారించారు. ఈ నోటిఫికేషన్ సోమవారం విడుదల కాగా, ఈ నెల 8వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తారు. స్పెషల్ కేటగిరీ (పీహెచ్/ఎన్‌సీసీ/స్పోర్ట్స్/భారత్ స్కౌట్స్) సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను జూలై మూడో వారంలో చేపడతారు. అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయిన అనంతరం ఆగస్టు మొదటి వారంలో తరగతులు ప్రారంభమవుతాయి.

నాలుగు వేల సీట్లు

రాష్ట్రంలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో ఒక్కో చోట వెయ్యి చొప్పున మొత్తం నాలుగు వేల సీట్లు ఉన్నాయి. వీటికి సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన పది పరీక్షల్లో 59,696 మంది ఉత్తీర్ణత సాధించగా, వీరిలో 47,182 మంది ప్రథమ, 8,550 మంది ద్వితీయ, 3,964 మంది తృతీయ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. ముఖ్యంగా ఫస్ట్ డివిజన్‌లో ఉత్తీర్ణులైన 47,182 మంది మధ్యే పోటీ ఉంటుంది. ఈ ఏడాది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన వారి సంఖ్య అధికంగా ఉండడంతో పోటీ గట్టిగానే ఉంటుందని పలువురు భావిస్తున్నారు.

ఆర్జీయూకేటీ లోగో

వైఎస్సార్ చలువతో..

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అత్యున్నత సాంకేతిక విద్యనందించేందుకు 2008లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఇడుపులపాయ, నూజివీడు, తెలంగాణ రాష్ట్రంలోని బాసరలో ట్రిపుల్ ఐటీలను ఏర్పాటు చేశారు. ప్రారంభంలో అధిక సీట్లు కేటాయించగా 2010లో ఒక్కో ట్రిపుల్ ఐటీలో వెయ్యి సీట్లు ఉండేలా కుదించారు. 2014లో రాష్ట్ర విభజన అనంతరం బాసర ట్రిపుల్ ఐటీ తెలంగాణకు వెళ్లిపోవడంతో 2016లో ఒంగోలు, శ్రీకాకుళంలో ట్రిపుల్ ఐటీలను ప్రారంభించారు. వీటిలో 26 జిల్లాల విద్యార్థులకు సమానంగా సీట్లు ఇవ్వాలని వర్సిటీ అధికారులు నిర్ణయించారు. నాలుగు వేల సీట్లలో ఓపెన్ కేటగిరీలో 600 సీట్లను స్థానికేతరులు, తెలంగాణ, ఎన్ఆర్ఐ, తదితరులకు కేటాయిస్తారు. మిగిలిన 3,400 సీట్లను 26 జిల్లాల వారికి సమానంగా పంచుతారు. జిల్లాకు కేటాయించే సీట్ల ఆధారంగా మెరిట్ విద్యార్థులకు అవకాశం లభించనుంది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదివిన విద్యార్థులకే ట్రిపుల్ ఐటీలో అధిక సీట్లు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన వారికే అవకాశం ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ

ఎంపిక ప్రక్రియలో భాగంగా ఇద్దరు విద్యార్థులకు సమానంగా మార్కులు వస్తే తొలుత గణితం, అనంతరం జనరల్ సైన్స్, తదుపరి ఇంగ్లిషు, సోషల్ స్టడీస్, ఫస్ట్ లాంగ్వేజస్‌లో అధిక మార్కులు వచ్చిన వారికి ప్రాధాన్యమిస్తారు. అప్పటికీ సమానంగా వస్తే పుట్టిన తేదీ ప్రకారం అధిక వయస్సు ఉన్న వారిని, హాల్ టికెట్ నంబర్ నుంచి పొందిన అత్యల్ప సంఖ్య ఆధారంగా ఎంపిక చేస్తారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు

ట్రిపుల్ ఐటీలో చేరేందుకు ఆసక్తి ఉన్న వారు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఆర్జీయుకేటీ.ఇన్/ఏపీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. బీసీ, ఈడబ్ల్యూఎస్, ఓసీ విద్యార్థులకు దరఖాస్తు రుసుముగా రూ.300గా, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.200గా నిర్ణయించారు.

ముఖ్యమైన తేదీలు : నోటిఫికేషన్ మే 6

- ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరణ మే 8 ఉదయం 11 గంటల నుంచి
- ఆన్‌లైన్ దరఖాస్తు స్వీకరణ తుది గడువు, సమయం, ఇతర వివరాలను త్వరలో ప్రకటించనున్నారు.

రూల్ ఆఫ్ రిజర్వేషన్

ట్రిపుల్ ఐటీలో అడ్మిషన్లకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తారు. రాష్ట్రంలోని అభ్యర్థులకు 85 శాతం సీట్లు, మిగిలిన 15 శాతం సీట్లు రాష్ట్ర పునర్విభజన చట్టం 2014 ప్రకారం రెండు తెలుగు రాష్ట్రాల్లోని విద్యార్థులకు కేటాయిస్తారు. అడ్మిషన్లలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తారు. ఎస్సీ–15, ఎస్టీ–6, బీసీ(ఎ)–7, బీసీ(బి)–10, బీసీ(సి)–1, బీసీ(డి)–7, బీసీ(ఇ)–4, దివ్యాంగులు–5, ఆర్మీ ఉద్యోగుల పిల్లలు(సీఏపీ)–2, ఎన్‌సీసీ–1, స్పోర్ట్స్–0.5, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్–0.5శాతం సీట్లు కేటాయిస్తారు. ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ప్రత్యేక కేటగిరీల్లో బాలికలకు 33.1/3 శాతం సీట్లు కేటాయిస్తారు.

వాహనాల తనిఖీలో రూ.2.71 కోట్ల పట్టివేత

బ్యాంకు సొమ్ము అని తేలడంతో విడుదల



నగదు దొరికిన వ్యాన్ వద్ద అధికారులు

రంగంపేట: సాధారణ ఎన్నికల తనిఖీల్లో భాగంగా వ్యాన్‌లో తరలిస్తున్న రూ.2.71 కోట్లను అధికారులు పట్టుకున్నారు. విచారణలో బ్యాంకు సొమ్ము అని తేలడంతో వదిలేశారు. వివరాలు.. మండలంలోని రామేశంపేట వద్ద ఏడీబీ రోడ్డుపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద సోమవారం తనిఖీలు నిర్వహిస్తుండగా వ్యాన్‌లో తరలిస్తున్న రూ.2.71 కోట్లను అధికారులు గుర్తించారు. సమాచారం అందుకున్న ఫ్లయింగ్ స్క్వాడ్ మేజిస్ట్రేట్ పి.వెంకటరత్నం చెక్‌పోస్టు వద్దకు చేరుకుని విచారణ చేపట్టారు. ఈ నగదు విశాఖపట్నంలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకుదని తెలిసింది. చాక్‌మేట్ కాంట్రాక్ట్ వాహనం ద్వారా విశాఖపట్నం బ్రాంచి నుంచి రాజమహేంద్రవరం బ్రాంచ్ తరలిస్తున్నట్టు గుర్తించారు. అన్ని విషయాలను క్షుణ్ణంగా పరిశీలించి, ఆధారాలను నిర్ధారణ చేసుకున్న తర్వాత ఆ నగదును విడుదల చేశారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌టీ మేజిస్ట్రేట్ పి.వెంకటరత్నం, ఏఎస్సై వి.త్రినాథరావు, కానిస్టేబుల్ జీవీఎస్ఎస్ రెడ్డి, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

రత్నగిరికి ఉత్సవ శోభ

- సత్యదేవుని దివ్య కల్యాణ మహోత్సవాలకు చురుకుగా ఏర్పాట్లు
- ఈ నెల 18 నుంచి 24 వరకూ వేడుకలు
- భక్తుల రాకకు అనుగుణంగా వసతులు



సత్యదేవుని ఆలయానికి రంగులు వేస్తున్న సిబ్బంది



స్వామివారి కల్యాణ వేదిక, దీనిచుట్టూ స్టెయిన్‌లెస్ స్టీల్ గ్రిల్స్ ఏర్పాటు చేయనున్నారు

అన్నవరం: రత్నగిరిపై కొలువైన సత్యదేవుని దివ్య కల్యాణ మహోత్సవాలకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహించడానికి అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. స్వామి వారి కల్యాణ మహోత్సవాలకు మరో 12 రోజులు మాత్రమే వ్యవధి ఉండడంతో ఆలయ ప్రాంగణంలో రంగులు వేసే పనులు చురుకుగా జరుగుతున్నాయి. స్వామివారి టేకు రథం చక్రాలకు ఇనుప పట్టీలను రథానికి రంగులు వేయడం మొదలయ్యాయి.

19వ తేదీన సత్యదేవుని కల్యాణం

ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించాలని పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు అధ్యక్షతన గత నెల 28వ తేదీన దేవ స్థానంలో జరిగిన ప్రభుత్వ శాఖలు, దేవస్థానం అధికారుల సమన్వయ కమిటీ సమావేశంలో నిర్ణయించిన విషయం విదితమే. తర్వాత దేవస్థానం ఈఓ కె.రామచంద్ర మోహన్ ఆలయ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి ఉత్సవాలకు చేయాల్సిన పనులపై ఆదేశాలిచ్చారు. ఉత్సవాలలో భాగంగా మే 19వ తేదీ రాత్రి 8.30 గంటల నుంచి సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవం జరుగుతుంది. దీనిని తిలకించేందుకు వేల సంఖ్యలో భక్తులు విచ్చేసే అవకాశం ఉన్నందున ఆ రోజు విస్తృత ఏర్పాట్లు చేయడానికి నిర్ణయించారు.

శరవేగంగా పనులు

సత్యదేవుని ధ్వజస్తంభానికి పీఠం ఏర్పాటు చేసే పనులు చురుకుగా జరుగుతున్నాయి. తర్వాత స్తంభానికి బంగారు రేకు తాపడం చేసే పనులు ప్రారంభిస్తామని పనులను పర్యవేక్షిస్తున్న డీఈఈ ఉదయ్ తెలిపారు. సత్యదేవుని నూతన టేకు రథాన్ని గత నెల 24వ తేదీన లాంఛనంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. మిగిలిన పనులు పూర్తి చేయడంతో పాటు రంగులు వేస్తున్నారు. చక్రాలకు ఇనుప బద్దెలతో పట్టీలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రంగులు వేసే పనులు చేస్తున్నట్లు కాంట్రాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణం, వ్రత మంటపాలు, ఇతర భవనాలకు రంగులు వేసే కార్యక్రమం చురుకుగా జరుగుతోంది.



నూతన ధ్వజస్తంభ పీఠం

ఈ పనులు ఈ నెల 15వ తేదీ కల్లా పూర్తి కానున్నాయి. వార్షిక కల్యాణ వేదికకు రంగులు వేసే పనులు పూర్తయ్యాయి. దీనిపైకి భక్తులు ఎక్కకుండా చుట్టూ మెస్ చట్రాలు పెట్టారు. అయితే వాటి స్థానంలో స్టెయిన్‌లెస్ స్టీల్‌తో చేసిన గ్రిల్స్ ఏర్పాటు చేయాలని ఈఓ ఆదేశించారు.

దంపతులను ఢీకొన్న లారీ

- భార్య మృతి, భర్తకు తీవ్రగాయాలు
- పిఠాపురంలో ఘటన



యజ్జల పంపాదమ్మ (ఫైల్)



ప్రభుత్వ ఆసుపత్రిలో విలపిస్తున్న కుటుంబీకులు

పిఠాపురం: లారీ ఢీకొన్న ఘటనలో భార్య మృతి చెందగా, భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. టౌన్ ఎస్సై మురళీమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. పిఠాపురంలోని జగ్గయ్య చెరువు వైభవ్ వెంచర్స్‌లో నివాసం ఉంటున్న యజ్జల అప్పారావు, పంపాదమ్మ (55) సొంతూరు తొండంగి మండలం ఎర్రయ్యపేట పంచాయితీ వి.కొత్తపేట గ్రామం. పిల్లల వ్యాపారాలు, ఉద్యోగాల రీత్యా ఈ దంపతులు దశాబ్ద కాలం క్రితం పిఠాపురానికి వచ్చారు. కాగా.. సోమవారం ఉదయం 7 గంటల సమయంలో పిఠాపురం నుంచి ఎలక్ట్రికల్ ద్విచక్ర వాహనంపై భార్యభర్తలిద్దరకూ కోనపాపపేట బయలుదేరారు. నగరంలోని ఉప్పాడ బస్టాండ్ వద్ద వీరిని ఓ లారీ వెనుక నుంచి బలంగా ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనం నుంచి జారి కింద పడిపోయిన పంపాదమ్మ మీదుగా లారీ వెళ్లపోయింది. ఆమె అక్కడికక్కడే మృతి చెందగా అప్పారావుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు ఈ దంపతుల కుమారులు బాబ్జి, రమణ ఘటనా స్థలానికి చేరుకున్నారు. తండ్రిని స్థానికుల సహాయంతో ఆసుపత్రికి తరలించారు. పంపాదమ్మ మృతదేహాన్ని పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా పోస్టుమార్టం పూర్తయింది. ఆస్పత్రి వద్దకు బంధువులు పెద్దసంఖ్యలో చేరుకున్నారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్, యాజమాని కొండెవరానికి చెందిన సింహాద్రి మల్లికార్జునరావుపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. పోలీసులు లారీని సీజ్ చేసి, కేసు నమోదు చేశారు.

మిత్ర పురుగులతో తెల్లదోమ నివారణ



రైతులకు బదనికలను అందిస్తున్న కేంద్ర అధిపతి చలపతిరావు

అంబాజీపేట: కొబ్బరి తోటలను నష్టపరుస్తున్న తెల్లదోమ నివారణ మిత్రపురుగుతోనే సాధ్యమవుతుందని వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్ర అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు తెలిపారు. అంబాజీపేట వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రంలో తెల్లదోమ నివారణ బదనికలను రైతులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది తెల్లదోమ ఉధృతి తక్కువగానే ఉందన్నారు. గత ఏడాది నవంబర్ నుంచి తీవ్రత ఉండేదని, ప్రస్తుతం ఈ ఏడాది మార్చిలో కనిపించిందన్నారు. ఆయా ప్రాంతాల్లోని రైతులందరూ ఏకకాలంలో సమష్టిగా మిత్రపురుగులను కొబ్బరి చెట్లపై విడుదల చేయడం వల్ల తెల్లదోమను అరికట్టవచ్చన్నారు. గంగా బొండం, మినియన్ యెల్లో డొరా బొండం, హైబ్రీడ్ బొండాల రకాల కొబ్బరి చెట్లకు తెల్లదోమ అధికంగా ఉందని గుర్తించామన్నారు. ప్రస్తుత కాలంలో కొబ్బరి తోటల్లో యాజమాన్య పద్ధతులను రైతులు పూర్తిగా విస్మరించారన్నారు. యాజమాన్య పద్ధతులు పాటిస్తే దిగుబడులు పెరగడంతో పాటు తెగుళ్ల నివారణను అరికట్ట వచ్చని రైతులకు సూచించారు. తెల్లదోమ నివారణకు బదనికలను స్థానిక ఉద్యాన పరిశోధన కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని కొబ్బరి రైతులు వీటిని సద్వినియోగం చేసుకుని తెల్లదోమను నివారించాలని కోరారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ అనూష తదితరులు పాల్గొన్నారు.

తాటిపర్తి ఘటనలో మాజీ ఎమ్మెల్యే వర్మ హస్తం

- హత్యా రాజకీయాలకు ఆయన ప్రోత్సాహం
- గొల్లప్రోలు పోలీసులకు వైఎస్సార్ సీపీ నాయకుల ఫిర్యాదు



గొల్లప్రోలు పోలీస్ స్టేషన్ దగ్గర విలేకరులతో మాట్లాడుతున్న దాసం వెంకటేష్

గొల్లప్రోలు: పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. తాటిపర్తి గ్రామంలో జరిగిన సంఘటన వెనుక ఆయన హస్తం ఉందని ఆరోపించారు. ఈ మేరకు సోమవారం మాజీ ఎమ్మెల్యే వర్మపై గొల్లప్రోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తాటిపర్తి గ్రామంలో ఆదివారం సాయిధరమ్‌తేజ్ ఎన్నికల ప్రచార ర్యాలీలో జరిగిన వివాదం నేపథ్యంలో గొల్లప్రోలు, రూరల్ మండల వైఎస్సార్ సీపీ నాయకులు ఈ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తాటిపర్తి ఉప సర్పంచ్ దాసం వెంకటేష్ విలేకరులతో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే వర్మ స్థానిక యువకులను రెచ్చగొట్టి భౌతిక దాడులకు ప్రోత్సహిస్తున్నారన్నారు. తమ ఇళ్లపై రాళ్ల దాడులు చేయించారని తెలిపారు. సాయిధరమ్ తేజ్‌పై జరిగిన సంఘటనతో తమ కార్యకర్తలకు ఎటువంటి సంబంధం లేదన్నారు. ఆ ఘటనను తాము ఖండిస్తున్నామని, పోలీసులు విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సాయిధరమ్ తేజ్‌పై దాడి జరగలేదు : డీఎస్పీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ హనుమంతరావు

కాకినాడ క్రైం: పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని గొల్లప్రోలు మండలంలో కూటమి తరఫున ఆదివారం ప్రచారానికి వచ్చిన నటుడు సాయిధరమ్ తేజ్‌పై దాడికి యత్నించారన్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదని కాకినాడ డీఎస్పీ హనుమంతరావు స్పష్టం చేశారు. ఈ మేరకు కాకినాడలోని డీఎస్పీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. రోడ్ షోలో పాల్గొన్న తేజ్ కాన్వాయ్ తాటిపర్తి గ్రామం మీదుగా చిన జగ్గంపేటకు వెళ్లి, అక్కడ ప్రచారం ముగించుకుని వెనక్కి వచ్చిందన్నారు. తాటిపర్తి కూడలికి చేరేసరికి కాన్వాయ్ విడిపోయిందని చెప్పారు. అలా విడివడిన కాన్వాయ్‌లో సాయి ధరమ్ తేజ్ అక్కడి నుంచి వెళ్లిపోయిన అరగంట తర్వాత ఓ వ్యక్తికి గాయం కావడం వెలుగులోకి వచ్చిందన్నారు. బీరు బాటిళ్లు, గాజు గ్లాసులతో దాడి చేశారన్న విషయంలో ఎటువంటి వాస్తవం లేదని స్పష్టం చేశారు. అందుకు తగ్గ ఎటువంటి ఆధారాలు ఘటనా స్థలిలో లభ్యం కాలేదని డీఎస్పీ అన్నారు. గాయాల పాలైన వ్యక్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.